815) దేసాళం / హుసెని

ప॥ పిడికిటి తలబ్రాలపెండ్లికూతుర నేను। వొడివట్టి తియ్యకున్న వూరకే యేమాయెను॥

చ॥ కనుగొన నిచ్చితివి కడుమోహ మిచ్చితివి। మనసియ్యకుండితేను మరేమాయెను।
పెనగగ జేసితివి బెట్టు రట్టు సేసితివి। నను బొందుసేయకున్న నడుమ నేమాయెను॥

చ॥ సడి నాపై వేసితి వాసల గింద వేసితివి। యెడసి చేవేయకున్న నేమాయెను।
వడి సటలాడితివి వట్టి మేలాలాడితివి। కడు జూజాలాడకున్న కమ్మటి నేమాయెను॥

చ॥ జుట్టి నొట్టు పెట్టితివి సవతుల బెట్టితివి। యిట్టె తమ్మపెట్టకున్న నేమాయెను।
గుట్టున శ్రీవేంకటేశు కూడి కోపమాపితివి। అట్టె తమి యాపకున్న అందుకు నేమాయెను॥